ప్రజా రిపబ్లిక్ స్పెషల్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No: APTEL/2023/87888
శుక్రవారం
26 సెప్టెంబర్ 2025

మహిళల ఖాతాల్లో రూ.10వేలు:ఎన్నికల వేళ బిహార్ బొనాంజా

సెప్టెంబర్ 26, (రిపబ్లిక్ న్యూస్): అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తోన్న తరుణంలో బిహార్ ప్రభుత్వం అక్కడి మహిళలకు నవరాత్రి కానుక అందించింది. ఒక్కొక్కరికీ రూ.10వేలు చొప్పున 75లక్షల మంది మహిళల ఖాతాల్లో డబ్బు జమ చేసింది. శుక్రవారం ప్రధాని నరేంద్రమోదీ 'ముఖ్యమంత్రి మహిళా రోజ్‌గార్ యోజన' ప్రారంభించడం ద్వారా నేరుగా వారి ఖాతాల్లోకి నగదు బదిలీ చేశారు.

దిల్లీలో ఉన్న మోదీ వర్చువల్గా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. దీనికి బిహార్ ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్, ఇతర మంత్రులు హాజరయ్యారు. రూ.7,500 కోట్లతో బిహార్లోని ఎన్డీయే ప్రభుత్వం ఈ పథకాన్ని తీసుకువచ్చింది. మహిళా సాధికారత, స్వయంఉపాధి కల్పించడం దీని ఉద్దేశం. ప్రతి కుటుంబంలో ఒక మహిళకు ఈ స్కీమ్ కింద రూ.10వేలు నేరుగా అందాయి. తర్వాత వివిధ దశల్లో ఆ సహాయం రూ.2 లక్షల వరకు ఉండనుంది. స్వయంఉపాధి కోసం పశు పోషణ, వ్యవసాయం, టైలరింగ్ వంటి రంగాల్లో ఆ మొత్తాన్ని ఉపయోగించుకోవచ్చని ప్రభుత్వం ఓ ప్రకటనలో వెల్లడించింది. ఈ కార్యక్రమం సందర్భంగా లబ్దిదారులను ఉద్దేశించి మోదీ మాట్లాడారు. "ఈ నవరాత్రి సందర్భంగా బిహార్ మహిళల సంతోషంలో నేనూ భాగమైనందుకు ఆనందంగా ఉంది. ఇక్కడ నాకు స్త్రీశక్తి లక్షలాదిమంది మహిళలు కనిపిస్తున్నారు. వారి ఆశీర్వాదాలు మాకు గొప్ప బలం" అని పేర్కొన్నారు. "ప్రధానమంత్రి మోదీ మీకోసం పని చేస్తున్నారు. గత ప్రభుత్వం అలా కాదు. ఆయన (లాలూ ప్రసాద్ యాదవ్ను ఉద్దేశించి) సీఎం పదవిని కోల్పోయినప్పుడు.. తన సతీమణిని ముఖ్యమంత్రిని చేశారు. తన కుటుంబం గురించి మాత్రమే ఆందోళన చెందారు. మేం మాత్రం బిహార్ ప్రజలందరి కోసం పనిచేస్తాం" అని విపక్ష ఆర్జేడీపై నీతీశకుమార్ విమర్శలు చేశారు.

ఎస్కేయూ అక్రమాలపై విచారణకు కమిటీ:మంత్రి నారా లోకేశ్

అమరావతి, సెప్టెంబర్ 26, (రిపబ్లిక్ న్యూస్): అనంతపురం శ్రీకృష్ణ దేవరాయ యూనివర్సిటీలో 2019-24 నడుమ జరిగిన అక్రమాలపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ శాసనసభలో తెలిపారు. కంప్యూటర్ల కొనుగోలులో దుర్వినియోగం, యూనివర్సిటీ వాహనాలను వ్యక్తిగత అవసరాలకు వినియోగించడం, నిబంధనలకు విరుద్ధంగా పదోన్నతులు, నియామకాలు, రిక్రూట్మెంట్లో రూల్స్ ఆఫ్ రిజర్వేషన్ పాటించకపోవడంపై కమిటీ వేస్తామన్నారు.

వంద రోజుల్లో నివేదిక తెప్పించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. ప్రశ్నోత్తరాల సమయంలో శాసనసభ్యులు ఎంఎస్ రాజు, పల్లె సింధూర రెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి లోకేశ్ సమాధానమిస్తూ... పారదర్శకంగా విశ్వవిద్యాలయాలు నడిపించాలనే లక్ష్యంతో ప్రజాప్రభుత్వం ఉందని తెలిపారు. గురువారం ఆంధ్రా యూనివర్సిటీలో ఒక విద్యార్థి ఫిట్స్తో చనిపోయారని.. దీనిపై కొన్ని విద్యార్థి సంఘాలు ఆందోళన చేయడం సరికాదన్నారు. ప్రభుత్వపరంగా ఎలాంటి తప్పు లేకపోయినా రాజకీయాలు చేయడం సరికాదని చెప్పారు. రాజకీయాలకు అతీతంగా పారదర్శకంగా యూనివర్సిటీ వీసీలను నియమిస్తున్నట్లు తెలిపారు. ఆంధ్రా యూనివర్సిటీని టాప్ -100 వర్సిటీల్లో ఒకటిగా తీర్చిదిద్దే బాధ్యతను ముఖ్యమంత్రి తనకు అప్పగించారని పేర్కొన్నారు. కొంతమంది వారి స్వార్థం కోసం కావాలని విశ్వవిద్యాలయాల్లో గొడవలు సృష్టించడం బాధాకరమన్నారు. పాలిటెక్నిక్ కళాశాలలకు నూతన భవనాల నిర్మాణానికి చర్యలు రాష్ట్రంలో భవనాలు లేని పాలిటెక్నిక్ కళాశాలలకు నూతన భవనాల నిర్మాణానికి చర్యలు తీసుకున్నట్లు మంత్రి నారా లోకేశ్ శాసనసభలో తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రెండు కళాశాలల భవన నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయని చెప్పారు. చోడవరం, పొన్నూరు, బేతంచర్ల, మైదుకూరు, గుంతకల్లు కాలేజీలకు భూములు కేటాయించామని.. మచిలీపట్నం, కేఆర్ పురం, అనపర్తిలో త్వరలో కేటాయిస్తామని వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ఎంపీ లాడ్స్, సీఎస్ఆర్ నిధులను అనుసంధానించి సొంత భవనాల నిర్మాణం పూర్తి చేస్తామని తెలిపారు. పాలిటెక్నిక్లలో అడ్మిషన్లు 70శాతంగా ఉన్నాయన్నారు. కన్వెన్షనల్ కోర్సులకు ఎవరూ రావడం లేదని.. వాటిని రీడిజైన్ చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

జీఎస్టీ సంస్కరణలతో ఏపీ ప్రజలకు రూ.8 వేల కోట్ల లబ్ధి:మంత్రి పయ్యావుల

అమరావతి, సెప్టెంబర్ 26, (రిపబ్లిక్ న్యూస్): నూతనంగా చేపట్టిన జీఎస్టీ సంస్కరణల ద్వారా ఆంధ్రప్రదేశ్ ప్రజలకు రూ.8 వేల కోట్ల లబ్ధి చేకూరనుందని ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. జీఎస్టీ సవరణ బిల్లును ఆయన శాసనసభలో ప్రవేశపెట్టగా ఆమోదం పొందింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. జీఎస్టీ వంటి విప్లవాత్మక మార్పు ప్రపంచంలోనే ఎక్కడా జరగలేదని తెలిపారు. ఈ ఘనత ప్రధాని నరేంద్ర మోదీకి దక్కుతుందని పేర్కొన్నారు. జీఎస్టీ లబ్ధిపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రచార కార్యక్రమం చేపట్టినట్లు వివరించారు."పల్నాడు జిల్లా గుండ్లపల్లికి చెందిన తెదేపా కార్యకర్త తోట చంద్రయ్యను అత్యంత దారుణంగా హత్య చేశారు. అప్పట్లో ప్రతిపక్ష నేతగా ఉన్న చంద్రబాబు ఆ గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కుటుంబానికి రూ.25 లక్షలు ఆర్థిక సాయం చేయడంతో పాటు పాడె మోశారు. రాజకీయ ప్రేరేపిత హింసకు బలైపోయిన వారికి అండగా నిలబడేందుకు ప్రభుత్వ ఉద్యోగం హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ దిశగా చర్యలు తీసుకున్నాం. తోట చంద్రయ్య కుమారుడు తోట వీరాంజనేయులుకు ఉద్యోగం ఇవ్వాలని నిర్ణయించాం. సీఎంతో పాటు మంత్రి నారా లోకేశ్ ఈ విషయంలో చొరవ చూపారు. తీవ్రవాదుల హింసకు బలైపోయిన వారికి ఉద్యోగాలు ఇచ్చిన చరిత్ర గతంలో ఉంది. అదే క్రమంలో ఇప్పుడు రాజకీయ హింసకు బలైపోయిన వారికి ఉద్యోగం ఇస్తున్నారు" అని పయ్యావుల తెలిపారు.

7 బిల్లులకు మండలి ఆమోదముద్ర

శాసనసభలో ఆమోదం పొందిన 7 బిల్లులకు మండలి ఆమోదముద్ర వేసింది. సంబంధిత శాఖల మంత్రులు సభలో బిల్లులను ప్రవేశపెట్టి వాటిని ఆమోదించాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆక్వాకల్చర్ డెవలప్మెంట్ అథారిటీ సవరణ బిల్లు 2025కు శాసన మండలి ఆమోదం తెలిపింది. ఆంధ్రప్రదేశ్ గ్రామ వార్డు సచివాలయం సవరణ బిల్లు 2025, ఆంధ్రప్రదేశ్ పురపాలక శాసనాల సవరణ బిల్లు-2025కు శాసన మండలి ఆమోద ముద్ర వేసింది. ఆంధ్రప్రదేశ్ పురపాలక శాసనాల రెండో సవరణ బిల్లు-2025, ఆంధ్రప్రదేశ్ పురపాలక శాసనాల మూడో సవరణ బిల్లు 2025, ఆంధ్రప్రదేశ్ పురపాలక శాసనాల నాలుగో సవరణ బిల్లు-2025, ఆంధ్రప్రదేశ్ మున్సిపాలిటీల సవరణ బిల్లు 2025కు శాసన మండలి ఏకగ్రీవంగా ఆమోద ముద్ర వేసింది.

పాత్రికేయులు కావలెను
తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న
రిపబ్లిక్
తెలుగు దినపత్రికలో తెలుగు రాష్ట్రాలలో బ్యూరోలు, జిల్లా స్టాఫర్లు, నియోజకవర్గ మరియు మండల స్థాయి పాత్రికేయులు కావలెను.
ఆసక్తి గలవారు సంప్రదించండి
9948814188 9985876888

సినిమా టికెట్లకే ఇలాంటి పిటిషన్లు వేస్తున్నారు.. 'ఓజీ'పై కోర్టులో వాదనలు

పవన్ కల్యాణ్ హీరోగా తెరకెక్కిన 'ఓజీ' టికెట్ ధరలపై తెలంగాణ హైకోర్టులో వాదనలు కొనసాగుతున్నాయి. 'ఓజీ' యూనిట్ తరపున సీనియర్ న్యాయవాది నిరంజన్ రెడ్డి వాదనలు వినిపిస్తున్నారు. సినిమా టికెట్ రేట్లపై కొంతమందికే అభ్యంతరం ఉందని ఆయన కోర్టుకు తెలిపారు. "5 స్టార్ హోటల్లో కాఫీ రూ.500 ఉంటుంది. దిల్జిత్ షో అంటే టికెట్ ధర వేలల్లో ఉంటుంది. ఆ ధరలపై నిర్వాహకులకే అధికారం ఉంటుంది. హైదరాబాద్లో అనిరుధ్ షో ఏర్పాటుచేయాలనుకుంటే, అతడికి నచ్చిన రేట్లో నిర్వహిస్తాడు. సినిమా టికెట్ ధరలను ప్రభుత్వం రెగ్యులేట్ చేస్తుంది. ఇదే ఓజీ సినిమాను దిల్లీలో చూడాలంటే రూ.1500 టికెట్ ధర ఉంటుంది. ఐపీఎల్ మ్యాచ్ టికెట్ రూ.1500 ఉంటుంది. అదే టికెట్ రూ.200కు కావాలని పిటిషనర్ కోర్టు ఎందుకు రారు? దిల్జిత్ షో రూ.10 వేలు ఉంటే రూ.200కే కావాలని ఎందుకు రారు?. కేవలం సినిమా టికెట్ ధరలపై మాత్రమే ఇలాంటి పిటిషన్లు వేస్తున్నారు. "సినిమా టికెట్ ధరలపై మేము ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేస్తే రూ.100, రూ.150 పెంచుకోమని ఉత్తర్వులు ఇచ్చారు. రూ.150 కూడా పిటిషనర్కు కష్టం అనుకుంటే సాధారణ రేట్ ఉన్నప్పుడే సినిమా చూడాలి. పిటిషనర్ మొదటిరోజు సినిమా చూడాలంటారు. ఆయనకు నచ్చిన ధరతోనే చూడాలి అనుకుంటే ఎలా ?" అంటూ నిరంజన్రెడ్డి వాదనలు వినిపిస్తున్నారు.

రిపబ్లిక్ స్పోర్ట్స్

ఎందుకో సెలక్టర్లనే అడగండి :కరుణ్ నాయర్

వెస్టిండీస్తో స్వదేశంలో రెండు టెస్టుల సిరీస్ను టీమ్ ఇండియా ఆడనుంది. సెలక్షన్ కమిటీ చీఫ్ అజిత్ అగార్కర్ కమిటీని ఎంపిక చేసింది. అనుకున్నట్లుగానే కరుణ్ నాయర్కు చుక్కెదురైంది. దాదాపు ఎనిమిదేళ్ల తర్వాత వచ్చిన ఛాన్స్ను సద్వినియోగం గత ఇంగ్లాండ్ పర్యటనలో చేసుకోవడంలో విఫలం కావడం అతడికి ప్రతికూలంగా మారింది. అంతగా ప్రభావం చూపించలేదు. దీంతో ఈసారి విండీస్తో టెస్టు సిరీస్కు ఎంపిక చేయలేదు. తాను ఎంపిక కాకపోవడంపై కరుణ్ నాయర్ స్పందించాడు."టెస్టులకు ఎంపిక అవుతానని భావించా. అయితే, అలా జరగలేదు. ఏం మాట్లాడాలో కూడా తెలియడం లేదు. దీనిపై ఎక్కువ కామెంట్లు చేయలేను. సమాధానం ఇవ్వడం కూడా చాలా కష్టమే. సెలక్టర్లు ఏం ఆలోచించారో వారినే అడగాలి. ఇంగ్లాండ్పై చివరి మ్యాచ్లో ఎవరూ ఆడనప్పుడు నేను హాఫ్ సెంచరీ చేశా. జట్టు కోసం కంట్రిబ్యూట్ చేశానని భావించా. ఆ మ్యాచ్లో మనం గెలిచాం. కానీ, అవేవీ ఇక్కడ పరిగణనలోకి తీసుకోలేదు" అని కరుణ్ వెల్లడించాడు.

అగార్కర్ ఏమన్నాడంటే?

"కరుణ్ నుంచి భారీగా ఆశించాం. కానీ, ఫలితం వేరేలా ఉంది. నాలుగు టెస్టులు ఆడాడు. కేవలం ఒక్క ఇన్నింగ్స్ లోనే కాస్త ఫర్వాలేదనిపించాడు. దీంతో స్వదేశంలో టెస్టు సిరీసు దేవదుత్ పడిక్కల్ వైపు చూశాం. ప్రతిఒక్కరికీ కనీసం 15 నుంచి 20 టెస్టుల వరకూ ఆడే అవకాశం ఇవ్వాలని మేం భావిస్తాం. కానీ, దురదృష్టవశాత్తూ కొన్నిసార్లు జరగకపోవచ్చు" అని సెలక్షన్ కమిటీ చీఫ్ అగార్కర్ వ్యాఖ్యానించారు.

ఆరోగ్యం

రోటీ, చపాతీలపై నెయ్యి రాసి తింటున్నారా, మీకు మీరే ప్రాబ్లమ్స్ తెచ్చుకుంటున్నట్లే, ఎందుకంటే

చపాతీ, రోటీపై నెయ్యి వేసి తినడం చాలా మందికి ఇష్టమే. మరికొంతమంది దీనిపై కొద్దిగా పంచదార కూడా వేసి తియ్యగా ఎంజాయ్ చేస్తారు. అయితే, ఇలా తినడం మంచిది అని కొంతమంది అంటే మరికొంతమంది ఇలా తినడం వల్ల సమస్యలొస్తాయని చెబుతున్నారు. ఆచార్య బాలకృష్ణ దీని గురించి ఏం చెబుతున్నారంటే

అన్నీ రకాల కొవ్వులలో నెయ్యి హెల్దీ ఫ్యాట్. ఇది బాడీలో మంచి కొలెస్ట్రాల్ని పెంచుతుంది. దీని వల్ల జీర్ణ సమస్యలు తగ్గుతాయి. ఇమ్యూనిటీ పెరుగుతుంది. నెయ్యిలోని విటమిన్స్ ఎ, డి, ఇ, కె వంటి పోషకాలు శరీరానికి మేలు చేస్తాయి. దీనిని తినడం వల్ల శరీరానికి శక్తి అందుతుంది. ఎక్కువసేపు కడుపు నిండినట్లుగా ఉంటుంది. కొంతమంది ఎక్స్పర్ట్స్ ప్రకారం నూనె బదులు నెయ్యిని వాడితే చాలా మంచిది. అందుకోసమే మనం నెయ్యిని వంటల్లో భాగంగా చేస్తాం. నెయ్యిని ఇష్టపడేవారు ఇడ్లీ, దోశలు, ఇలా ఏ టిఫిన్స్లో అయినా నెయ్యిని యాడ్ చేసి తింటారు. ఇక చపాతీలు తినేటప్పుడు కూడా కాస్తా వేడిగా ఉన్నప్పుడే నెయ్యి రాసి తింటారు. దీని వల్ల చపాతీ, రోటీల రుచి పెరగడమే కాకుండా మంచిదని తింటారు. కానీ, ఇది అస్సలే మంచిది కాదని చెబుతున్నారు ఆచార్య బాలకృష్ణ. నెయ్యి స్వతహాగా మంచిదే అయినప్పటికీ చపాతీలపై రాసి తినడం మంచిది కాదని చెబుతున్నారు.

చపాతీలపై నెయ్యి

మన తినే ఫుడ్లో అన్నంతో పాటు చపాతీలు, రోటీలు కూడా ఓ భాగమైపోయాయి. బరువు తగ్గాలనుకునేవారు రోటీ, చపాతీలని ఎక్కువగా తింటారు. అయితే, వీటిని కాస్తా రుచిగా తినాలనుకునేవారు చపాతీలపై కాస్తా నెయ్యి రాసి తింటారు. ఇదివరకూ ఇలా చేయడం మంచిదని చెప్పేవారు. కానీ, రాన్రాను కొన్ని సమస్యలు కూడా ఉన్నాయని చెబుతున్నారు.

నెయ్యి

నెయ్యి మనకి లభించిన గొప్ప వరమని చెప్పొచ్చు. దీనిని వంటల్లో వాడడమే కాకుండా, పూజల్లోనూ వాడతారు. అంతేకాదు, దీనిలోని గుణాల కారణంగా అందాన్ని పెంచడంలో కూడా వాడతారు. ఇలా ఎన్నో ప్రయోజనాలున్న నెయ్యిని చాలా ఆరోగ్య సమస్యల్ని దూరం చేయడం దగ్గర్నుంచీ అందాన్ని కాపాడడం వరకూ వాడొచ్చు. దీనిని తీసుకోవడం వల్లపేగు ఆరోగ్యం మెరుగ్గా మారుతుంది. ఎముకలు బలంగా మారతాయిఇమ్యూనిటీ పెరుగుతుందిజీర్ణ సమస్యలు కూడా తగ్గుతాయి. బరువుని మెంటెయిన్ చేయడంలో నెయ్యికి ప్రత్యేక స్థానంమూల వ్యాధులు తగ్గడంతగ్గుకి చెక్కుండె సమస్యలకి మంచిదిమెరుగైన జ్ఞాపకశక్తినొప్పి నివారణిగా కూడా పనిచేస్తుంది.

ఆచార్య బాలకృష్ణ ప్రకారం

పతంజలి యోగాపీఠం అధిపతి ఆచార్య బాలకృష్ణ ప్రకారం నెయ్యి రోటీలపై రాసి తినడం మంచిది కాదు. ఇదే విషయం తన యూట్యూబ్ ఛానెల్లో షేర్ చేసిన వీడియోలో చెబుతున్నారు. నెయ్యి తింటే చాలానే లాభాలు ఉంటాయి. అలానే చపాతీలు కూడా మంచిదే. కానీ, రెండింటిని కలిపి తినకూడదని చెబుతున్నారు.

ఎందుకు వద్దు



బాలకృష్ణ ప్రకారం, రోటీ మీద నెయ్యి పూయడం వల్ల ఓ లేయర్లా ఏర్పడుతుంది. ఇది జీర్ణమవ్వడానికి కష్టమవుతుంది. ఈ పొర ఆహారాన్ని సరిగ్గా జీర్ణమవ్వనివ్వదు. దీని కారణంగా గ్యాస్, అజీర్ణం, బరువుగా అనిపించడం వంటి సమస్యలొస్తాయి. ఇలా తిన్న రోటీలు త్వరగా అస్సలు జీర్ణమవ్వవు. అంతేకాకుండా గ్యాస్ పట్టేసినట్లుగా చాలా ఇబ్బందిగా ఉంటుంది.

ఎలా తినాలి

మీరు నెయ్యితో రోటీ తినాలనుకున్నప్పుడు చపాతీలపై నెయ్యి వేయకుండా మీరు తినే పప్పు, కూరల్లో నెయ్యి వేసి తినండి. దీని వల్ల ఎలాంటి సమస్యలు రావు. జీర్ణ సమస్యలు అసలే రావు. పైగా రుచి అలానే ఉంటుంది. అయితే, మరీ ఎక్కువగా వేయొద్దొని గుర్తుంచుకోండి. దీంతో కూడా చాలాసమస్యలొస్తాయి.

రోటీలు మెత్తగా రావాలంటే

ఇక రోటీలు మెత్తగా ఉండాలనుకుంటే పిండిని కలిపినప్పుడే నెయ్యి వేయండి. ఇలా చేస్తే రోటీలు మృదువుగా ఉంటాయి. ఈజీగా జీర్ణమవుతాయి. రోటీలపై నెయ్యి రాసే బదులు ఇది బెస్ట్ ఆప్షన్. కాబట్టి, ఇక నుంచి ఇలా చేసి చూడండి. దీంతో ఎక్కువ సమయమైనా రోటీలు గట్టిగా కావు. మెత్తగానే ఉంటాయి.

గమనిక: ఇది సాధారణ సమాచారం కోసం మాత్రమే. ఇది ఏ విధంగానూ ఏ మెడిసిన్ లేదా చికిత్సకు ప్రత్యామ్నాయం కాదు. వీటిని పాటించేముందు మరింత సమాచారం కోసం ఎల్లప్పుడూ మీ వైద్యుడిని సంప్రదించండి.